క్లుప్తంగా

పెద్దదోర్నాల ఎస్సైగా మహేష్


ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల ఎస్సైగా వి.మహేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం బాధ్యతల్లో ఉన్న అంకమరావు మార్కాపురం రూరల్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. వీఆర్‌లో ఉన్న మహేష్‌ను పెద్దదోర్నాలకు బదిలీ చేయడంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. మహేష్‌ను పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. దీంతో పాటు ఘాట్ రోడ్లలో తరుచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ


పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న డెయిరీ నిర్వాహకులు

ముండ్లమూరు: పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం బోనస్ పంపిణీ చేశారు. మండలంలోని ఈదరలో కృష్ణా మిల్క్ యూనియన్, విజయ డెయిరీ వారు గడిచిన నాలుగు నెలలకు గాను నూటికి ఏడు రూపాయలు చొప్పున పాడి రైతులకు మూడు లక్షల బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా మేనేజర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు కోటి రూపాయల బోనస్‌ను పాడి రైతులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ సుబ్బారెడ్డి, ఈదర సంఘం అధ్యక్షుడు యరబ్రోలు శ్రీకాంత్‌రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న త్రిపురాంతకం అంబేడ్కర్ కాలనీ యువకులు

త్రిపురాంతకం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానిక అంబేడ్కర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. త్రిపురాంతకంలో భారత్ బంద్‌లో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేయించారు. బీ.బాలనాసర్, శాంతారావు, వెంకటస్వామి, కోటి, రాజేంద్ర ప్రసాద్, రామారావు, వినయ్ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో శామ్యూల్‌జాన్

పుల్లలచెరువు: పాఠశాలలో ఉపాధ్యాయులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో శామ్యూల్ జాన్ అన్నారు. బుధవారం మండలంలోని ఐటీ వరం ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నాణ్యత, రుచి విషయంలో ఉపాధ్యాయులు, ఏజెన్సీ సిబ్బంది కాని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులంతా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు.

రైతుకు కనష్టం

పొగాకు రైతులకు ఈ ఏడాది కలిసొచ్చేలా కనిపించడం లేదు. దేశం అంతా వర్షాలు పడుతూ ప్రజలు అతలాకుతలం అవుతుంటే ఇక్కడ మాత్రం వరుణుడు కరుణించడం లేదు. పైగా భానుడి ప్రతాపానికి స్థానికులు అల్లాడిపోతున్నారు. నారుమడులు పెట్టిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. వర్షాలు లేక కనీసం ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.


ఏపుగా పెరిగిన పొగనారు


తలలు కోసి పక్కన పడేసిన పొగాకు


ఏపుగా పెరిగిన నారు

- పొగనారు మడులతో అవస్థలు
- అడియాసలైన రైతుల ఆశలు
- తగ్గని భానుడు ప్రతాపం
- అల్లాడిపోతున్న అన్నదాత

కురిచేడు: వర్షాలు సక్రమంగా కురవక పంటల సాగు చేయలేక రైతులు విలవిల్లాడుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా పొగనారు మడులు ఏర్పాటు చేసిన రైతులపై పెను భారం పడింది. సకాలంలో వానలు లేక పోవడంతో రైతులు తమ భూముల్లో పొగాకు పంట సాగు చేసి పనులు కల్పించుకుంటున్నారు. ఈ విధంగానైనా రైతు కూలీలకు ఉపాధి లభిస్తుంది. ఈ ఏడాది ఇంతవరకు పదునయ్యే వాన కురవక పోవడంతో పొలాలన్నీ బీళ్లుగా మారాయి. చిన్నపాటి వర్షాలకు ఆశపడి పొగాకు నాట్లు వేసిన రైతులు చేతులు కాల్చుకున్నారు. నాటిన మొక్కలు మొత్తం పూర్తిగా ఎండిపోయి పెట్టిన పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరైంది. వర్షాలు లేక ఒక నష్టమైతే, చిరు జల్లులు మరో నష్టాన్ని రైతులకు ఈ ఏడాది తెచ్చిపెట్టింది.

ఆరు వేల ఎకరాల్లో నారుమడులు

ఈ ఏడాది వర్షాలు వెనకడుగు వేయటంతో అదును దాటిన తర్వాత ఎలాగైనా వర్షాలు కురుస్తాయని భావించారు. రైతులు వేరే పంటలు సాగు చేసేందుకు అవకాశం లేకపోవటంతో తప్పకుండా పొగాకు పంట సాగు చేస్తారని పొగాకు కంపెనీల యజమానులు ఎక్కువ మంది రైతులతో పొగనారుమడులు పెట్టించారు. ఐటీసీ, జీపీఐతో పాటు చిన్న చితకా కంపెనీలు కలిసి సుమారు ఆరు వేల ఎకరాల్లో నారుమడులు ఏర్పాటు చేయించారు. చరిత్రలో ఇంతవరకు పొగనారు మడులు ఏర్పాటు చేసి ఇంత దారుణంగా నష్టపోయిన దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి సుమారు 1.5 లక్షల రూపాయలు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 3 లక్షల మొక్కలు వస్తాయి. కాలం సక్రమంగా అయితే ఎకరాకు 2 లక్షల రూపాయలు వస్తాయి. పెట్టుబడులు పోను ఎకరాకు 50 వేల రూపాయలు మిగులుతాయి.

ఇలాగే ఉంటే.. నారుమడులు మడతే


తలలు కోసిన పొగనారు

ఇదే పరిస్థితి మరో 10-15 రోజులు కొనసాగితే నారుమడులు పూర్తిగా వదిలి వేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగమొక్కలు మొలచిన తరువాత 15-30 రోజుల లోపల నాటాల్సి ఉంది. అప్పటికి మొక్క నాలుగు అంగుళాల నుంచి ఆరు అంగుళాలు ఎత్తు ఉంటుంది. అలాగైతేనే ఆ మొక్కలు మంచి దిగుబడులు ఇస్తాయి. కానీ ప్రస్తుతం పొగమొక్క ఎత్తు సుమారు అడుగున్నర వరకు పెరిగిపోయింది. నారుమడుల రైతులు తలలు కోపించినా కూడా మళ్లీ పెరిగిపోయింది. వర్షాలు లేకపోవటంతో నారుమడుల వద్దకు వచ్చే వారే లేక కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పొగనారుమడులు ఏర్పాటు చేసిన రైతులను పొగాకు కంపెనీలు, ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ఇంత నష్టం ఎప్పుడూ రాలేదు:



పొగనారు పంట సాగు చేయటం ప్రారంభించాక ఇంత నష్టం ఎప్పుడూ చూడలేదు. పొగాకు చరిత్రలో ఇదొక మాయని మచ్చలా నిలిచిపోతుంది. ఈ ఏడాది 3 ఎకరాలు పొగనారుమడులు ఏర్పాటు చేశా. ఐదు లక్షలు పెట్టుబడి పెట్టా. ఐదు వేలు కూడా తీసుకునే పరిస్థితి లేదు. వర్షాలు కురిసినా మళ్లీ నారుమడులు ఏర్పాటు చేద్దామన్నా విత్తనాలు లేవు. ఈ ఏడాదితో పొగానారు అంటే భయపడే పరిస్థితి వచ్చింది. రైతులను ప్రభుత్వం, పొగాకు కంపెనీలు ఆదుకోవాలి.

ఇందూరి అమిరిరెడ్డి, నారుమడి రైతు, కురిచేడు

బీఎల్‌ఓలు, రాజకీయ నేతలతో సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలకు, వివిధ పార్టీ రాజకీయ పార్టీ నాయకులకు ఓటరు నమోదు, సవరణపై తహసీల్దార్ బి.రమాదేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఓటరు నమోదు, సవరణ కార్యక్రమం ఉంటుందన్నారు. బీఎల్‌ఓలు ఆ తేదీల్లో గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి ఓటర్లతో మాట్లాడి సమస్య తెలుసుకుని నమోదు చేస్తారు. ఎవరికైనా ఒకే చోట రెండు ఓట్లు ఉంటే తొలగించుకోవచ్చన్నారు. రాజకీయ నాయకులు ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల్లో సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఎవరికైనా రెండు ఓట్లు ఉంటే వారిపై అభ్యంతరం తెలియపరిస్తే తాము బీఎల్‌ఓలతో సర్వే చేసి తొలగిస్తామన్నారు. 1-1-2025 నాటికి సవరణలు పూర్తి చేసి తప్పు ఒప్పులను సరి చేస్తూ రెండు చోట్ల ఒకే వ్యక్తికి ఓటు ఉంటే దాన్ని తొలగిస్తూ ప్రతి సమస్యపై సమాచారాన్ని తీసుకుని అందరికీ ఆమోద యోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రాజకీయ నాయకుల అభిప్రాయాలు తహసీల్దార్ రమాదేవి అడిగి తెలుసుకున్నారు.

దర్శి: ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఇంటింటికీ ఓటర్ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఫొటోలు సరిగా లేని వారు, పేర్లు తప్పులుగా ఉన్న వారు, వయసు సవరణ, ఇంటి నంబరు సవరణలు బీఎల్‌ఓ యాప్‌లో తప్పులు సరి చేసి నమోదు చేస్తామని చెప్పారు. బీఎల్‌ఓలు అందరూ మరణించిన ఓటర్ల వివరాలు పరిశీలన జరిపి ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల ప్రకారం ఓటరు జాబితా నుంచి తొలగిస్తారన్నారు. 1 జనవరి 2024 నుంచి 18 సంవత్సరాలు నిండి స్థానికంగా ఆరు మాసాలు ఉన్న ఓటు లేని వారికి ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేస్తామని చెప్పారు. 29 అక్టోబర్ 2024 నుంచి వచ్చిన క్లెయిమ్‌లన్నింటినీ 24 డిసెంబర్ 2024లోపు పరిష్కరిస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల మార్పులు ఉంటే రాత పూర్వకంగా తెలియజేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు.

కురిచేడు: ఓటరు జాబితాపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.రజనికుమారి అధ్యక్షతన బుధవరం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంటింటికీ బీఎల్‌ఓలు వెళ్లి ఓటర్లను వెరిఫికేషన్ చేయాలని, ఓటరు జాబితాలో ఫొటోలు సరిగా లేకపోయినా, పేర్లు తప్పులున్నా, వయసు సవరణ, ఇంటి నెంబర్ సవరణలు చేస్తారని తహసీల్దార్ తెలిపారు. నకిలీ ఓట్లు, మరణించిన వారి ఓట్ల వివరాలు గుర్తించి ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం జాబితా నుంచి తొలగిస్తారని తెలిపారు. జనవరి 25 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తారని తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా, బీఎల్‌ఓ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అక్టోబర్ 29 డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విచారణ జరుపుతానన్నారు. అభ్యంతరాలపై విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన తేదీల్లో స్పెషల్ క్యాంపు డేస్ నిర్వహిస్తామన్నారు. వచ్చిన క్లెయిమ్‌లన్నింటినీ డిసెంబర్ 24లోగా పరిష్కరించి తుది జాబితాలో ప్రచురణ చేయనున్నట్లు ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి


కరుణానిధి (ఫైల్)

దర్శి: ప్రభుత్వ హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించి పేద విద్యార్థులకు అండగా ఉండాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు దోమలతో కుట్టించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. కొన్ని హాస్టల్స్‌లో కిటికీలు లేక దోమలతో కుట్టించుకుంటూ విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థుల హాస్టళ్లలో పాలకులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కరుణానిధి డిమాండ్ చేశారు.

బేస్‌లైన్ పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: మండలంలోని పలు సీబీఎస్ఈ పాఠశాలల్లో బుధవారం జరిగిన బేస్‌లైన్ పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో ఇందిరా ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సీబీఎస్ఈ విధానానికి దోహదపడే విధంగా సామర్థ్యాలు అంచానా వేసేందుకు ప్రభుత్వం మొదటిసారిగా డిజిటల్ విధానంలో పరీక్ష నిర్వహిస్తోందని, ఈ విధానం రాబోయే రోజుల్లో సాంకేతికతను అందిపుచ్చుకుని పరీక్షలకు సిద్ధం కావాల్సిందిగా ఆమె కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని, ట్యాబ్‌లను తనిఖీ చేశారు. ట్యాబ్‌ల వాడకం గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

పుల్లలచెరువులో పశువైద్య శిబిరం


గేదెకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో పశుసంవర్ధక శాఖ తరపున పశు వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. వైద్య శిబిరం మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ యోగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో నాయుడిపాలెం పశువైద్యులు డాక్టర్ ప్రవల్లిక బాయి అధ్వర్యంలో 250 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. చూడి పరీక్షలు, తిరగ కట్టే పశువులను, ఎదకు రాని పశువులకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం సంబంధించిన మందులు పశుపోషకులకు పంపిణీ చేశారు. ఎంపీటీసీ మేదికొండ రాధాకృష్ణ, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రభుత్వ వైద్యశాల రోడ్డు


వైద్యశాల రోడ్డు ఇలా..

దొనకొండ: స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే రోడ్డు చినుకు పడితే చిత్తడి, గుంతలమయం, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులుగా మారింది. పట్టణానికి సుమారు కిలోమీటర్ దూరంలో వైద్యశాల నిర్మించారు. బస్టాండ్ సెంటర్ నుంచి రోగులు వైద్యశాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందికరంగా ఉంది. వర్షం పడితే గుంతల్లో వారం రోజులు నీరు నిలిచి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే రోడ్డు మొత్తం జారుతోంది. ఎన్నోసార్లు వాహనాలు జారి రోగులకు గాయాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రోజూ వైద్య సిబ్బంది వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోంది. అదే దారి నుంచి బాదాపురం, ఎస్సీ కాలనీ, కాశి నాయన ఆశ్రమం, గ్యాస్ కంపెనీకి వెళ్తుంటారు. వైద్యశాల సిబ్బంది, స్థానికులు ఎనోసార్లు అధికారులకు తెలియజేశారు. మరి ముఖ్యంగా రాత్రి వేళ అనుకోకుండా సంఘటన జరిగిన సమయంలో వైద్యశాలకు వెళ్లాలంటే రోడ్డు వెంబడి విష సర్పాలు తిరుగుతుంటాయి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

జీఓకు అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహించాలి


డీవై డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెద్దారవీడు: రాష్ట్ర ప్రభుత్వం జీఓ సాధనలకు అనుగుణంగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు, ఎంఈఓ పి.శ్రీనివాసుల సమక్షంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ పెద్దారవీడు మండలం మారుమూల మండలం కావడంతో ఉపాధ్యాయుల కొరత కారణంగా డిప్యూటేషన్ కూడా వెళ్లలేని మారుమూల గ్రామాలు చాలా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఉన్నా పోస్టులు కేటాయించలేదన్నారు. ఉర్దూ ఎస్‌జీటీ పోస్టును తెలుగుగా చూపించి తెలుగు ఎస్‌జీటీ పోస్టును రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దయతో పాఠశాల విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్టెమెంట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ముందుగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీ స్థానంలో భర్తీ చేసిన తదుపరి మాత్రమే ఉన్నత పాఠశాలల్లో ఖాళీ భర్తీ చేయాలని విన్నవించారు. గ్రీవెన్స్‌లో న్యాయమైన నిబంధనలకు అనుగుణంగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన తర్వాతనే కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూటీఎఫ్ నాయకులు డిప్యూటీ ఉప విద్యాశాఖాధికారి ఎంఈఓ పి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.శ్రీరాములు, జనరల్ సెక్రెటరీ డి. యల్లమందారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.